

మొదటి బహుమతి పొందిన ముగ్గు,
(ఇన్‌సెట్‌లో) మొదటి బహుమతి విజేత బల్యాల శ్రీలత



రెండో బహుమతి ముగ్గు,
(ఇన్‌సెట్‌లో) రెండో బహుమతి విజేత ఎలిగేటి రూపిక



మూడో బహుమతి ముగ్గు
(ఇన్‌సెట్‌లో) మూడో బహుమతి విజేత దొంతుల అక్షరసాయి

అవనిపై హరివిల్లు

- ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ ముత్యాల ముగ్గుల పోటీకి విశేష స్పందన
- తరలివచ్చిన మహిళలు
- ఆకట్టుకున్న రంగవల్లులు



ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

సంక్రాంతి సంబరాలు ముందే వచ్చేశాయా అన్నట్లుగా రంగురంగుల ముగ్గులు ఆకట్టుకున్నాయి. వేములవాడ కేంద్రంలోని రాజశ్రీ ఫంక్షన్‌హాల్‌లో ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీ పవర్డ్‌బయ్ ఏఎంసీ విద్యా సంస్థలు, రియల్ పార్ట్‌నర్ స్వర్గసీమ సుకేతన సౌజన్యం, స్థానిక పార్టనర్ వేములవాడలోని హోంటౌన్ ఫ్యామిలీ రెస్టారెంట్ సహకారంతో ఆదివారం నిర్వహించగా విశేష స్పందన లభించింది. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి మహిళలు పెద్దసంఖ్యలో తరలివచ్చి ఉత్సాహంగా పాల్గొన్నారు. ముగ్గులు వేయడానికి పోటీ పడ్డారు. ఆకర్షణీయమైన రంగులతో తెలంగాణ సంప్రదాయం ఉట్టిపడేలా వేసిన ముగ్గులు శోభను ఇచ్చాయి. విభిన్న ఆకృతులతోపాటు సంక్రాంతి సంప్రాదాయాలు ఉట్టిపడే విధంగా ముగ్గులను అలంకరించారు. వేములవాడ మున్సిపల్ ఛైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, ఆంధ్రజ్యోతి రాజన్న సిరిసిల్ల జిల్లా స్టాఫ్ రిపోర్టర్ టి.వి.నారాయణ, కో స్పాన్సర్స్ హోం టౌన్ రెస్టారెంట్ ఎండీ ఎం .మహేష్, సెస్ మాజీ డైరెక్టర్ రాజు బహుమతులు అందజేశారు. అనూష, కళ్యాణి న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు.

● విజేతలు వీరే..

ఎంతో ఆసక్తిగాసాగిన ముత్యాల ముగ్గుల పోటీలో బల్యాల శ్రీలత (వేములవాడ) ప్రథమ, ఎలిగేటి రూపిక (సిరిసిల్ల) ద్వితీయ, దొంతుల అక్షరసాయి (వేములవాడ) తృతీయ బహుమతులు గెలుపొందారు. వద్లూరి రితిక, మామిండ్ల మానస, సీహెచ్ ప్రణయ, మానస, రాజ్యలక్ష్మీ కన్సొలేషన్ బహుమతులు అందుకున్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.6 వేలు, రూ.4 వేలు, రూ.3 వేలతోపాటు జ్ఞాపిక, సర్టిఫికెట్‌లు అందించారు. కన్సొలేషన్ బహుమతిగా రూ.500 నగదుతోపాటు జ్ఞాపిక, సర్టిఫికెట్ అందజేశారు. పోటీల్లో పాల్గొన్న వారందరికీ జ్ఞాపికలు, సర్టిఫికెట్‌లను అందజేశారు.



● భావితరాలకు సంప్రదాయాలు అందించాలి

- రామతీర్థపు మాధవి, మున్సిపల్ ఛైర్‌పర్సన్

మన సంస్కృతీసంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందని వేములవాడ మున్సిపల్ ఛైర్‌పర్సన్ రామ తీర్థపు మాధవిరాజు అన్నారు. ఆంధ్రజ్యోతి ఏబీఎన్ ఏటా నిర్వహించే ముగ్గుల పోటీతో మన సంస్కృతీసంప్రదాయలను గౌరవించే విధంగా ఆలోచనలు కలుగుతాయన్నారు. సంక్రాంతి పండుగను సంతోషంగా జరుపుకోవాలన్నారు. హోంటౌన్ ఎండీ మహేష్ మాట్లాడుతూ రెండో సారి కో స్పాన్సర్‌గా అవకాశం లభించిందని, మహిళలను మరింత ప్రోత్సహించే విధంగా ముగ్గుల పోటీ నిర్వహిస్తామని అన్నారు. అంతకుముందు స్పాన్సర్లను ఛైర్ పర్సన్ మాధవి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రజ్యోతి ఏబీఎన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● సంతోషంగా ఉంది

- బల్యాల శ్రీలత, ప్రథమ బహుమతి

ఆంధ్రజ్యోతి ఏబీఎన్ ముగ్గులపోటీలో మొదటి బహుమతి రావడం చాలా సంతోషంగా ఉంది. సంక్రాంతి పండుగ వచ్చిందటే ముగ్గులపోటీకి ఎదురుచూస్తాం. ముగ్గులు వేయడం అంటే ఎంతో ఇష్టం.

● మహిళలను ప్రోత్సహించడం అభినందనీయం

- ఎం.అనూష న్యాయ నిర్ణేత

మహిళలను ప్రోత్సహిస్తూ ఆంధ్రజ్యోతి ముగ్గుల పోటీలు నిర్వహిఒచడం అభినందనీయం. ముగ్గులపోటీల్లో గెలుపు, ఓటములు సహజం, నిబంధనల ప్రకారం విజయం ముగ్గురిని వరించినా మిగతా వారు నిరుత్సాహపడకుండా పోటీలను స్ఫూర్తిగా తీసుకోవాలి. ముగ్గులు మహిళలకు వ్యాయామం పరంగా ఉపయోగపడుతాయి.

● సంప్రదాయాలు ఉట్టిపడేలా..

- కళ్యాణి న్యాయ నిర్ణేత

ఏటా సంక్రాంతికి ముందు ముగ్గుల పోటీ నిర్వహించడం అభినందనీయం. మహిళల్లో ఉన్న సృజనాత్మకత బయటకు వస్తుంది. సంస్కృతీ సంప్రదాయాలు ఉట్టిపడేలా ముగ్గులు వేశారు. ముగ్గుల పోటీలో రాష్ట్రస్థాయిలో రాణించాలి.



ప్రథమ బహుమతి అందుకుంటున్న శ్రీలత



ముగ్గులను పరిశీలిస్తున్న న్యాయనిర్ణేతలు

ఎలక్ట్రోరల్ డ్రాఫ్ట్ వెల్లడి

- రెండు సెగ్మెంట్లలో 4,68,064 మంది ఓటర్లు

సిరిసిల్ల, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్‌ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఎలక్ట్రోరల్ డ్రాఫ్ట్‌ను వెల్లడించింది. శనివారం రాత్రి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అనురాగ్ జయంతి పేర్కొన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ, సిరిసిల్ల రెండు సెగ్మెంట్లలో 4,68,064 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు 2,26,973 మంది. మహిళలు 2,40,895, జెండర్‌లు 37 మంది, సర్వీస్ ఓటర్లలో 153 మంది పురుషులు, ఆరుగురు మహిళలు ఉన్నారు. ఇందులో వేములవాడ సెగ్మెంట్‌లో 2,24,071మంది ఓటర్లు ఉండగా పురుషులు 1,07,725 మంది. మహిళలు 1,16,263 మంది, జెండర్ లు 30మంది, సర్వీస్ ఓటర్లలో 50 మంది పురుషులు, ముగ్గురు మహిళలు ఉన్నారు. సిరిసిల్ల సెగ్మెంట్‌లో 2,43,993 మంది ఓటర్లు ఉండగా పురుషులు 1,19,248 మంది. మహిళలు 1,24,632 మంది, జెండర్‌లు ఏడుగురు, సర్వీస్ ఓటర్లలో 103 మంది పురుషులు, ముగ్గురు మహిళలు ఉన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ముస్తాబాద్, జనవరి 7 : దాదాపు 25 ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థులు ఒక్క చోట చేరారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ముస్తాబాద్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత ప్రభుత్వ పాఠశాలో 1998-99 సంవత్సరంలో పదోతరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు ఆదివారం స్థానిక దత్తసాయి గార్డెన్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. దాదాపు 25 సంవత్సారాల తరువాత ఒక్క చోట చేరారు. చిన్నప్పటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఒకరికొకరు యోగక్షేమాలు తెలుసుకున్నారు. హైదరాబాద్, కామారెడ్డి, సిరిసిల్లా, సిద్దిపేట కరీంనగర్ వంటి పలు ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా ఒక్క చోట చేరే సరికి పండుగ వాతవరణం నెలకొంది. ఈ సందర్బంగా విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మా నించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన గూడెపు మహేందర్, అరుట్ల బాల్‌రెడ్డి, దేవలక్ష్మిని అభినందించారు. ఈకార్యక్రమంలో పూర్వ విద్యార్థులు గూడెపు మహేందర్, దీకొండ అంజి, జింక మల్లేశం, గందె హిమబిందు, సుంచు సుధాకర్, బాలసాని తిరుపతి, అరుట్ల బాల్‌రెడ్డి, దేవలక్ష్మీ, నీరటి రాజు, చేపూరి సత్యనారాయణ, అంజిరెడ్డి, బాలకిషన్ పాల్గొన్నారు.



ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

ఎమ్మెల్యేను కలిసిన ప్రైవేట్ వైద్యులు

ఇల్లంతకుంట, జనవరి 7: మండలంలోని ప్రైవేట్ వైద్యులు ఆదివారం మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణను కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు అభినందనలు తెలిపారు. గ్రామీణ వైద్యుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అన్ని వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రేపాక కనుకయ్య, ప్రధాన కార్యదర్శి దుద్దెడ రాజు, గౌరవ అధ్యక్షుడు లింగంపల్లి మల్లయ్య, కోశాధికారి వెంకటస్వామి, ఉపాధ్యక్షులు ఒల్లాల రాజు, కనుకయ్య, జెగ్గి రాజు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా ముందుకెళ్తా

- మధ్యమానేరు నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి కృషి
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న ఆది శ్రీనివాస్


వేములవాడ టౌన్, జనవరి 7 : తనను ఆదరించి గెలిపించిన వేములవాడ నియోజకవర్గ అభివద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతానని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. మండలంలోని రుద్రవరం గ్రామంలో ఆదివారం పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్బంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మధ్యమానేరు జలాశయంలో ముంపునకు గురైన నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ముంపు గ్రామాల సమస్యలు తెలిసిన వాడిగా 14 సంత్సరాలుగా పోరాటం చేస్తున్నట్లు చెప్పారు. ప్రతీ సమస్య తన దృష్టిలో ఉందని, నిర్వాసితులకు తగిన న్యాయం చేస్తామని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వంలో ఉన్న పెద్దలకు సైతం నిర్వాసితుల సమస్యలు తెలుసని, వారు సైతం నిర్వాసితుల ఆందోళనల్లో పలు మార్లు భాగస్వామ్యం అయ్యారని గుర్తు చేశారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా రెండు రోజుల్లోనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఆరోగ్యశ్రీ రూ. 10 లక్షల పెంచామని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన మరిన్ని హామీలను త్వరలోనే అమలు చేస్తామని వివరించారు. ఎన్నికలు జరిగే వరకే రాజకీయాలని, అభివృద్ధిలో మాత్రం అందరూ భాగస్వాములు కావాలని కోరారు. అంతకుముందు గ్రామానికి వచ్చిన ఆది శ్రీనివాస్‌కు గ్రామస్థులు మంగళహారతులు, డప్పుచప్పుళ్లతో ఘనస్వాగతం పలికారు. అనంతరం అంబేద్కర్, నేతాజీ, చాకలి ఐలమ్మ విగ్రహాలకు ఆయన పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంటు, ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన రెండు వంట గదులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బూర వజ్రమ్మబాబు, జడ్పీటీసీ మ్యాకల రవి, సర్పంచ్ ఊరడి రాంరెడ్డి, ఎంపీటీసీ గాలిపెల్లి సువర్ణస్వామి, సింగిల్ విండో ఛైర్మన్ రేగులపాటి కృష్ణదేవరావు, ఉపసర్పంచ్ తాడెం శ్రీనివాస్ యాదవ్ మాజీ సర్పంచ్ పిల్లి కనుకయ్య, కత్తి కనుకయ్య, వార్డు సభ్యులు తదితరులు ఉన్నారు.


మున్నూరు కాపుల ఆత్మీయ సమ్మేళనం

వేములవాడ పట్టణంలోని శ్రీరాజరాజేశ్వరి మున్నూరుకాపు సత్రంలో తూర్పువాడ మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో తనకు ఓటు వేసి గెలిపించిన సంఘం సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గతంలో రాజన్న ఆలయ ఛైర్మన్‌గా చేసిన వ్యక్తులు రాజకీయాల్లో రాణించలేరని దుష్ప్రచారం చేశారని, ఎమ్మెలేగా గెలవడంతో అపోహలు పటాపంచలయ్యాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కొండ దేవయ్య, బింగి మహేష్, చిలుక రమేష్, కూరగాయాల కొమురయ్య తదితరులు ఉన్నారు.



రుద్రవరంలో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఆది శ్రీనివాస్







మల్లికార్జున ఆలయంలో పట్నాలు



ఆలయంలో పట్నాలు వేస్తున్న భక్తులు

చందుర్తి, జనవరి 7: చందుర్తి మండలం నర్సింగాపూర్ గ్రామంలోని మోహినికుంట మల్లికార్జునస్వామి ఆలయానికి ఆదివారం పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి పట్నాలు వేసి మొక్కులు చెల్లించుకున్నారు. పాఠశాలలకు, కార్యాలయాలకు సెలవు కావడంతో భక్తులు అధిక సంఖ్యలో వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. స్వామికి పసుపు బండారితో పట్నాలు వేసి, బోనాలు సమర్పించారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. డోలు చప్పుళ్లతో శివశక్తుల పూనకాలతో ఆలయ పరిసరాలు మారుమోగాయి. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో దర్శనానికి క్యూలైన్లో గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది.

తలనీలాల టెండర్లు మళ్లీ వాయిదా?

మల్యాల, జనవరి 7: కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానం పరిధిలో తలనీలాల సేకరణకు అధికారులు రెండో సారి టెండర్లు ఆహ్వానించినా వాయిదా పడే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. దేవస్థానం అధికారులు ఆన్‌లైన్, బహిరంగ, సీల్డ్ టెండర్ల నిర్వహణకు గాను 8వ తేదీగా ప్రకటించారు. కాగా ఆదివారం వరకు బహిరంగ, సీల్డ్ టెండర్లకు దరఖాస్తులు దాఖలు కాలేదు. సోమవారం ఆన్‌లైన్ టెండర్లు ఓపెన్ చేయనున్నారు. ఆన్‌లైన్‌లో కూడా దరఖాస్తులు రాకపోతే రెండో సారి టెండర్లు వాయిదా పడనుంది. కాగా దేవస్థానం పరిధిలో అంతర్గత బదిలీలలో భాగంగా ఎస్టాబ్లిష్‌మెంట్ బాధ్యతలు నిర్వహిస్తున్న ఉమామహేశ్వర్‌రావుకు వేలం విభాగం కూడా కేటాయించారు.

జానపద గాయకుడు మృతి

- సంతాపం తెలిపిన ఎంపీ బండి సంజయ్



శ్రద్ధాంజలి ఘటిస్తున్న ఎంపీ(ఇన్‌సెట్‌లో శివకుమార్(ఫైల్))

కరీంనగర్ కల్చరల్, జనవరి 7: కళాభారతి వేదికగా పలు కార్యక్రమాల్లో జానపద గీతాలతో అలరించి ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో గుర్తింపు పొందిన జ్యోతీనగర్‌కు చెందిన దేశ శివకుమార్ (56) ఆదివారం గుండెపోటుతో మృతి చెందారు. జిల్లా బెస్త(గంగపుత్ర) సంఘం అధ్యక్షుడిగా ఉన్న ఆయన పలు జాతీయ, అంతర్జాతీయ వేదికలపై జానపద గీతాలతో అలరించారు. ఆయన మృతి ఉమ్మడి కరీంనగర్ జిల్లా కళాకారులకు తీరని లోటని పలువురు నాయకులు, కళాకారులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కుమార్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మాజీ ఎంపీ వినోద్ కుమార్, మేయర్ వై సునీల్‌రావు, మాజీ మేయర్లు రవీందర్‌సింగ్, డి శంకర్‌లు శివకుమార్ పార్థీవ దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, రాష్ట్ర బెస్త సంఘం అధ్యక్షుడు దీటి మల్లయ్య, టీఎన్‌జీవో నాయకుడు రాజేశం, కార్పొరేటర్ పెద్దపల్లి జితేందర్, గంగామాత ఆలయ అభివృద్ధి సంఘం అధ్యక్షుడు సెర్వ లక్ష్మీనారాయణ, పట్టణ సంఘం అధ్యక్షుడు కూర ధర్మరాజు, జానపద వృత్తి కళాకారుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు గుండ్ర కృపాదానం, ఉప కార్యదర్శి గోపాల్‌రావు, కార్యదర్శి సిద్ధిపేట ప్రకాశ్, కోలాటం కళాకారుడు ఇస్మాయిల్, కళాకారులు దిండిగాల రవీందర్, కుమార్ మహర్షి, కాసు మహేందర్‌రాజు, సంగెం రాధాకృష్ణ, చిట్టి తిరుపతి, ఉపేందర్ ప్రసాద్, వైఎస్ శర్మ, అనిల్ కుమార్‌గౌడ్, కాసు మధు, ఎస్‌పీ రాధాకృష్ణ, తబలా శంకర్, కొండాల్‌రావు, రఘువీర్‌సింగ్, ఎలిగేటి రాజేందర్‌ప్రసాద్, గొల్లపల్లి శ్రీరాములుగౌడ్ సంతాపం తెలిపారు.

వస్త్ర దుకాణంలో అగ్నిప్రమాదం



మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

కరీంనగర్ క్రైం, జనవరి 7: కరీంనగర్‌లోని రాజీవ్‌చౌక్‌లో మణిదీప్ ఫ్యాబ్రిక్ హౌజ్‌లో ఆదివారం వేకువ జామున అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో దాదాపు 10 లక్షల రూపాయల ఆస్తి నష్టం వాటిల్లినట్లు కరీంనగర్ ఫైర్ ఆఫీసర్ పరమేశ్వర్ తెలిపారు. మణిదీప్ ఫ్యాబ్రిక్ హౌజ్ నుంచి పొగ బయటకు వస్తుండటాన్ని గమనించిన స్థానికులు డయల్ 100కు కాల్ చేయగా కరీంనగర్ అగ్ని మాపకశాఖ అధికారులు ఘటనా స్థలంకు చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. అప్పటికే షాపులోని బట్టలు దగ్ధమయ్యాయి. షాపు నిర్వాహకులు ఎప్పటిలాగానే శనివారం రాత్రి షాపును మూసివేసి ఇంటికి వెళ్లినట్లు తెలిపారు. అర్ధరాత్రి తరువాత షాపులో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు అంటుకుని ప్రమాదం జరిగి ఉంటుందని భావిస్తున్నామని ఫైర్ ఆఫీసర్ తెలిపారు. మణిదీప్ ఫ్యాబ్రిక్ హౌజ్ యజమాని తిప్పిరెడ్డి సరితారెడ్డి ఫిర్యాదుతో కేసు విచారణ జరుపుతున్నామని ఫైర్ ఆఫీసర్ తెలిపారు.

ఇరిగేషన్ శాఖ కార్యాలయంలో చోరీ

- కంప్యూటర్లు మాయం

- మానేరు రివర్‌ఫ్రంట్, ఎల్‌ఎండీ పనుల వివరాలు వాటిలోనే?



పరిశీలిస్తున్న ఎస్సై చేరాలు

తిమ్మాపూర్, జనవరి7: మండలంలోని మహాత్మానగర్ గ్రామం ఎల్‌ఎండీ కాలనీలో గల కార్యనిర్వాహక ఇంజనీరు కార్యాలయం ఇరిగేషన్ డివిజన్ నెంబరు-5, ఇరిగేషన్ సర్కిల్-2 కార్యలయములో ఆదివారం దొంగతనం జరిగింది. కార్యాలయ అధికారులు, ఎల్‌ఎండి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం సెలవు దినం కావడంతో సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తులు కార్యలయం తాళాలు పగలగొట్టి లోనికి ప్రవేశించారు. కార్యల యంలో ఉన్న 4 సీపీయులు, 4 మానిటర్‌లు, రెండు ప్రింటర్లు సుమారు 2.50లక్షల విలువ గల వస్తువులను ఎత్తుకెళ్లినట్లు ఇరిగేషన్ అధికారులు ఎల్‌ఎండీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గతంలో ఇదే కార్యాలయం సమీపంలోనే వేరే ఇరిగేషన్ కార్యలయంలోనే దొంగతనం జరిగి కార్యాలయంలో ఉన్న ఫైల్‌లు దొంగిలించారు. ఈ కంప్యూటర్లలో మానేరు రివర్ ఫ్రంట్ , ఎల్‌ఎండీ పనుల వివరాలు ఉన్నట్లు చర్చ జరుగుతోంది.

● పనిచేయని సీసీ కెమెరాలు

ఇరిగేషన్ శాఖలో ఇరిగేషన్ డివిజన్ నెంబరు-5, కాగా దిగువ మానేరు జలశాయంకు సంబంధించి ముఖ్యమైన కార్యలయం. కీలకమైన కార్యాలయంలో సీసీ కెమెరాలు ఉన్నా అవి పనిచేయక పోవడంపై విమర్శలు వస్తున్నాయి. దొంగతనానికి పాల్పడ్డ వారు సీసీ కెమెరాలకు అనుసంధాన బాక్సును కూడా ధ్వంసం చేశారు. అల్మారాలు పగలు గొట్టినట్లు అనవాళ్లు ఉన్నాయి. ఏవైనా వస్తువులు, ఫైళ్లు ఎత్తుకెళ్లారా అనే విషయం పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది. సంఘటన స్థలానికి ఎల్‌ఎండీ ఎస్సై చేరాలు తమ సిబ్బందితో చేరుకొని కార్యాలయాన్ని పరిశీలించారు. ఇరిగేషన్ అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

ఆకట్టుకున్న ముగ్గుల పోటీలు

● ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉత్సాహంగా పాల్గొన్న మహిళలు



కరీంనగర్‌లో ముగ్గులను పరిశీలిస్తున్న న్యాయనిర్ణేతలు చొప్పరి జయశ్రీ, డాక్టర్ మౌనిక, హరిహర జువెల్లర్స్ అధినేత, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చిట్టుమల్ల శ్రీనివాస్, ఆంధ్రజ్యోతి ప్రతినిధులు



కరీంనగర్‌లో మాట్లాడుతున్న ఆంధ్రజ్యోతి బ్రాంచి మేనేజర్ కళ్లెపు సంపత్‌రెడ్డి

కరీంనగర్ కల్చరల్, జనవరి7: "ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరా బ్యాంకు ముత్యాల ముగ్గుల పోటీలు.. పవర్డ్ బై ఎయిమ్స్ విద్యా సంస్థలు, బెంగుళూరు.. రియల్ పార్ట్‌నర్ స్వర్గసీమ సుకేతన" ముగ్గుల పోటీలకు ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా విశేష స్పందన లభించింది. కరీంనగర్ జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన పోటీల్లో 60 మంది మహిళలు పాల్గొన్నారు. కరీంనగర్ భాగ్యనగర్‌కు చెందిన బండి విజయ లక్ష్మి అనే మహిళ అంగవైకల్యం ఉన్నప్పటికీ ఒక చేత్తో ముగ్గు వేసి మూడవ బహుమతి సాధించారు. ఇక్కడ ఎనిమిదేళ్ల చిన్నారి మొదలుకొని, 80 సంవత్సరాల వృద్ధురాలి వరకు పోటీలో ఉత్సాహంగా పాల్గొన్నారు. పెద్దపల్లి జిల్లాలో నిర్వహించిన పోటీలకు 108 మంది మహిళలు హాజరై ముగ్గులు వేశారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో నిర్వహించిన పోటీలకు 126 మంది మహిళలు హాజరై అవనికి రంగులు అద్దారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ కేంద్రంలో నిర్వహించిన పోటీలో 32 మంది మహిళలు పాల్గొని ముగ్గులు వేశారు. కరీంనగర్‌లో జరిగిన కార్యక్ర మంలో ముఖ్య అతిథిగా, జిల్లా స్థాయిలో స్పాన్సర్‌గా హరిహర జువెల్లర్స్ అధినేత, చాంబరాఫ్ కామర్స్ అధ్యక్షుడు చిట్టుమల్ల శ్రీనివాస్ వ్యవహరించారు. న్యాయ నిర్ణేతలుగా బీజేపీ మహిళామోర్చా జిల్లా అధ్యక్షు రాలు, కార్పొరేటర్ చొప్పరి జయశ్రీ, వైద్యురాలు డాక్టర్ మౌనిక వ్యవహరించారు. కార్యక్రమంలో ఆంధ్రజ్యోతి- ఏబీఎన్ బ్రాంచి మేనేజర్ కళ్లెపు సంపత్‌రెడ్డి, ఎడిషన్ ఇన్‌చార్జి పరుచూరి జయంత్‌రావు, ఏజీఎం దండ జనార్దన్ రెడ్డి, అసిస్టెంట్ మేనేజర్ నూగూరి శ్రావణ్ కుమార్ (ఎడివిటీ), ఏసీఎం పాపారావు, ప్రొడక్షన్ ఇన్‌చార్జి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ

వేములవాడ టౌన్, జనవరి 7: వేములవాడ శ్రీరాజ రాజేశ్వరస్వామి వారి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి శనివారం రాత్రి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ వసతి గదుల్లో విడిది చేసిన భక్తులు ఆదివారం తెల్లవారు జామునే శ్రీపార్వతిపరమేశ్వరులను దర్శించుకునేందుకు బారులు తీరారు. భక్తులు ముందుగా ధర్మగుం డంలో పవిత్ర స్నానాలు ఆచరించి కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించారు. ఆయా క్యూలైన్‌ల మీదుగా ఆలయంలోకి ప్రవేశించిన భక్తులు శ్రీ స్వామి వారిని దర్శించుకుని మొక్కు లు చెల్లించుకున్నారు. అనంతరం కోరిన కోర్కెలు తీర్చాలను కోడెమొక్కు, గండాలు తొలగిపోవాలని గండాదీపంలో నూనే పోసి రాజన్నను వేడుకున్నారు. ఆలయ అనుబంధ ఆలయాల్లో కుంకుమ పూజల్లో పాల్గొన్న భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్త కుండా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.



వేములవాడలో క్యూలైన్‌లో వేచిఉన్న భక్తులు



జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 7: రాజస్థాన్‌లో ఈనెల 9 నుంచి 13 వరకు నిర్వహించనున్న జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఉమ్మడి జిల్లాకు చెందిన క్రీడకారులు జైనపురం వంశీ, బి శివలు ఎంపికయ్యారు. డిసెంబర్ 8న తెలంగాణ హ్యాండ్‌బాల్ అసోసి యేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి జూనియర్ హ్యాండ్‌బాల్ ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రెడ్డవేని మధు, జిట్టవేణి శ్రీనులు తెలిపారు. ఈ సందర్భంగా ఈ క్రీడాకారులను జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యద ర్శులు నందెల్లి మహిపాల్, గసిరెడ్డి జనార్దన్ రెడ్డి, పెటా అధ్యక్ష, కార్యదర్శులు అంతడ్పుల శ్రీనివాస్, యూనిస్ పాషా, హ్యాండ్‌బాల్ అసోసియేషన్ సంఘ బాధ్యులు కలిగేటి శ్రీనివాస్, జట్టుపల్లి అశోక్, రాజ్ కుమార్, అనుప రెడ్డి, వీర్‌పాల్ రెడ్డి, భాస్కర్, ఐతరవేని శ్రీనివాస్, వద్లూరి రాజేందర్, సీనియర్ క్రీడాకారులు అభినందించారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఇద్దరి రిమాండ్

చిగురుమామిడి, జనవరి 7: మండలంలోని ఇందుర్తి, రామంచ గ్రామాల నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న బురికి ప్రభాకర్, పల్లం నర్సయ్య అనే ఇద్దరిని ఆదివారం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై బండి రాజేశ్ తెలిపారు. రెండు గ్రామాల నుంచి ఎలాంటి అనుమతులు లేకుండ అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని వచ్చిన సమాచారం మేరకు తనిఖీ చేశామని తెలిపారు. ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేవని తెలిసింది. ఇందుకు గాను ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్ పంపినట్లు ఎస్సై తెలిపారు. మండలంలో ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తే చట్టపరమైనా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇసుకను ఎవరైనా తరలించుకుపోతే గ్రామస్థులు సమాచారం అందించాలని కోరారు.

నేటి నుంచి ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు

గంగాధర, జనవరి 7: గంగాధరలో సోమవారం నుంచి ఉమ్మడి కరీంనగర్ జిల్లాస్థాయి క్రికెట్ పోటీలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. టెన్నిస్ బాల్‌తో నిర్వహిస్తున్న టోర్నమెంటులో గెలుపొందిన జట్టుకు 30వేల నగదుతో పాటు ట్రోఫీ, రన్నర్ జట్టుకు 15వేలు షీల్డ్‌ను అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.



ఉమ్మడి జిల్లా సీనియర్స్

ఖో-ఖో జట్ల ఎంపిక పోటీలు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న అతిథులు

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 7: జిల్లా ఖో-ఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా సీనియర్స్ ఖో-ఖో జట్ల ఎంపిక పోటీలకు విశేష స్పందన లభించింది. ఈ పోటీలకు ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 150 మంది మహిళలు, పురుషులు హాజరయ్యారు. ఈ క్రీడా పోటీలను డీవైఎస్‌వో కీర్తి రాజవీరు, సీనియర్ ఖో-ఖో క్రీడాకారులు మంగ సంతోష్, రేణులకు క్రీడాకారులను పరిచయం చేసుకొని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా ఖో-ఖో జట్లు రాష్ట్రస్థాయి పోటీల్లో విశేష ప్రతిభచాటి రాష్ట్ర చాంపియన్లుగా నిలవాలన్నారు. జిల్లాకు ఖో-ఖోలో మంచి పేరు ఉందన్నారు. ఈ సంవత్సరం కూడా ఉమ్మడి జిల్లా జట్లు ఉత్తమమైన ప్రతిభ చాటి రాష్ట్ర చాంపియన్‌గా నిలవాలన్నారు. జిల్లా ఖో-ఖో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నటరాజ్ రవి, వై మహేందర్‌రావులు పోటీలను పర్యవేక్షించగా, వ్యాయామ ఉపాధ్యాయులు, జిల్లా ఖో-ఖో సంఘ సభ్యులు ఎ రవీందర్, డి ప్రసాద్, యోగి, సంతోష్, కరుణాకర్, బి శేఖర్, శివకుమార్, రాజబాబు, రవళి, రేణుక, తదితరులు పాల్గొన్నారు.

ఉరి వేసుకుని ఒకరి ఆత్మహత్య

జమ్మికుంట, జనవరి 7: జమ్మికుంట పట్టణ పరిధిలోని పద్మశాలి వీధికి చెందిన ఒకరు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పట్టణ సీఐ బర్పటి రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. పద్మశాలి వీధికి చెందిన సిలివేరు ధనుష్ (18) అనే వ్యక్తి కొంత కాలంగా మూర్ఛ వ్యాధితో బాధ పడుతున్నాడు. చికిత్స తీసుకున్నా వ్యాధి నయం కాలేదు. దీంతో తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో రిటైర్డ్ టీచర్ మృతి



రాజయ్య(ఫైల్)

కరీంనగర్ క్రైం, జనవరి 7: కరీంనగర్ గాంధీ చౌరస్తా సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో విద్యారణ్యపురి కాలనీకి చెందిన రిటైర్డ్ టీచర్ బత్తిని రాజయ్య(76) మృతిచెం దినట్లు కరీంనగర్ మూడో ఠాణా పోలీసులు తెలిపారు. విద్యారణ్యపురికి చెందిన రాజయ్య మంచిర్యాల చౌరస్తా నుంచి స్కూటీపై గాంధీ చౌరస్తా వైపు వెళ్తుండగా వెనుక వైపు నుంచి మంచిర్యాల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో తీవ్ర గాయాల య్యాయి. స్థానికులు ఆటోలో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి మరణించినట్లు వెల్లడించారు. మృతుడి కొడుకు అనిల్ కుమార్ ఫిర్యాదు మేరకు ఆర్టీసీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.





ధర్మపురిలో మల్లన్న భక్తుల సందడి

ధర్మపురి, జనవరి 7: ధర్మపురి క్షేత్రంలో ఆదివారం మల్లన్న భక్తుల సందడి నెలకొంది. షష్ఠి వారోత్సవాలు పురస్కరించుకుని క్షేత్రానికి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. భక్తులు నెత్తి మీద మల్లికార్జున విగ్రహాల పెట్టెను పెట్టుకుని త్రిశూలం చేత పట్టుకుని నది వద్దకు చేరుకున్నారు. అనంతరం భక్తులు పవిత్ర గోదావరి నదిలో స్నానాలు చేశారు. అలాగే నదీ జలాలతో మల్లికార్జున విగ్రహాలను శుభ్రం చేశారు. నది వద్ద గల స్నానఘట్టాలు, ఇసుక మేటల పైన ప్రత్యేకంగా సైకత లింగాలు చేసి భక్తి శ్రద్ధలతో పూజించారు. ఇక్కడి నుంచి తమ గ్రామాల్లో మల్లన్న పట్నాలు వేసుకునేందుకు త్రిశూలం, ఒగ్గు డోలు చేత పట్టుకుని మెడలో పూల దండ వేసుకుని భక్తి పాటలు పాడుతూ భక్తులు విగ్రహాల పెట్టెలతో తిరుగు ప్రయాణం చేశారు. పట్నాలు వేసిన మరునాడు వేములవాడ, కొమరవెల్లి, ఓదేల, ఐనవోలు ఆలయాల్లో స్వామి వారలను దర్శనం చేసుకునేందుకు వెళ్లడం ఆనవాయితీగా వస్తోంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు గోదావరి నది వద్ద మల్లన్న భక్తులతో సందడి నెలకొంది. కాగా ఎల్లమ్మ పట్నాలు వేసుకునే భక్తులతో పాటు కొందరు తమ పిల్లలకు కేశ ఖండనం చేసి గంగమ్మ తల్లికి తెప్పె మొక్కులు తీర్చుకునేందుకు కూడా అధికంగా తరలి వచ్చారు. ఎగువ భాగాన గల దమ్మ న్నపేట, రాజారం వద్ద గోదావరి నది నీరు శుభ్రంగా ఉందని భావించి భక్తులు అక్కడికి వెళ్లి స్నానాలు ఆచరించారు. ఎస్సై దత్తాత్రి ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకున్నారు.



ధర్మపురిలో స్నానాలు ఆచరిస్తున్న మల్లన్న భక్తులు



వేంకటేశ్వర ఆలయంలో వైభవంగా లక్ష పుష్పార్చన



లక్ష పుష్పార్చన చేస్తున్న వేదపండితుడు



ప్రత్యేక అలంకరణలో స్వామి

కోరుట్ల, జనవరి 7: పట్టణంలోని వేంకటేశ్వర ఆలయంలో ధనుర్మాసోత్సవాల్లో భాగంగా ఆదివారం కొలాయి ఉత్సవం (వన మహోత్సవం) వైభవంగా నిర్వహించారు. ఆదివారం రాత్రి సమయంలో స్వామి వారికి లక్ష పుష్పార్చన కార్యక్రమాన్ని వేద పండితుడు బీర్నంది నర్సింహామూర్తి మత్రోచ్ఛారణల మధ్య నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించిన వేదపండితులు పుష్పార్చన కార్యక్రమాన్ని జరిపారు. కొలాయి ఉత్సవంలో భా గంగా వేంకటేశ్వర - అలివేలు మంగ - పద్మావతి సహిత ఉత్సవ విగ్రహాల కు ప్రత్యేక పూజలను నిర్వహించి అభిషేకం, అర్చన కార్యక్రమాలను జరిపారు. వేంకటేశ్వర భజన మండలి సభ్యులతో భజన కార్యక్రమాలను జరిపారు. అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించంగా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

9న ఉద్యోగ మేళా

గణేశ్‌నగర్, జనవరి 7: ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలు కల్పించేందుకు మంగళవారం ఉదయం 10గంటల నుంచి 2 గంటల వరకు జిల్లా ఉపాధి కల్పనాధికారి కార్యాలయంలో ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి కే దేవేందర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆక్సిస్ బ్యాంకు, త్రేడ్జ్ ఐటీ, నవతా రోడ్ ట్రాన్స్‌పోర్టులో పనిచేయుటకు ఆఫీసర్, సీనియర్ ఆఫీసర్, అసిస్టెంట్ మేనేజర్, ఐటీ మేనేజర్, బిజినెస్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్, కస్టమర్ సపోర్ట్ ఎగ్జిక్యూటివ్, టెలి మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్, ఫార్మసిస్టు, క్లర్క్, గ్రాడ్యుయేట్ ట్రైనీ, మెకానిక్, డ్రైవర్స్, క్లీనర్ పోస్టులు కలవని పేర్కొన్నారు. ఎస్‌ఎస్‌సి, ఇంటర్, డిగ్రీ, డిప్లమా, ఐటీ, బిటెక్, ఎంటెక్, ఎంబీఏ, ఎంసీఏ, బిఫార్మ, ఎంఫార్మ, డిఫార్మ కలిగిన అభ్యర్థులు అర్హులని తెలిపారు. వయస్సు 18-30 సంవత్సరాల్లోపు ఉండాలని, వేతనం 12 నుంచి 25 వేల రూపాయల వకు ఉంటుందని తెలిపారు. ఆసక్తిగల నిరుద్యోగ యువతీ, యువకులు సంబంధిత విద్యార్హతల సర్టిఫికెట్స్ జిరాక్స్, ఎక్స్‌పీరియన్స్ కాపీలతో జిల్లా ఉపాధి కల్పనాధికారి కార్యాలయంలో జరిగే ఉద్యోగమేళాలో పాల్గొనాలని కోరారు. ఇతర వివరాలకు 7207659969, 9700922136 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడికి సన్మానం



పుష్పగుచ్ఛం అందజేస్తున్న శ్రీరాములు

వేములవాడ టౌన్, జనవరి 7 : కరీంనగర్ జిల్లా టీఎన్జీవో అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌ను రాజన్న ఆలయ ఉద్యోగుల యూనియన్ గౌరవ అధ్యక్షుడు సిరిగిరి శ్రీరాములు ఘనంగా సన్మానించారు. ఆదివారం రాజన్న ఆలయానికి వచ్చిన సందర్భంగా శ్రీనివాస్‌కు ఆలయ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ ఉద్యోగల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీచ్చినట్లు తెలిపారు.

రాజుపేటలో అదనపు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్



మాట్లాడుతున్న సెస్ డైరెక్టర్ నారాయణరావు

గంభీరావుపేట, జనవరి 7 : రైతులకు లోవోల్టేజీ సమస్యను శాస్వతంగా పరిష్కరించేందుకు అదనపు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశామని సెస్ డైరెక్టర్ నారాయణరావు అన్నారు. గంభీరావుపేట మండలం రాజుపేటలో ఆదివారం రూ.4 లక్షల అంచనాలతో అదనపు ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. అంతరాయం లేకుండా పంటలకు విద్యుత్ సరఫరా చేసేందుకు ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఈ సందర్భంగా రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సత్యం తదితరులు ఉన్నారు.

రామచంద్రమూర్తికి వెండి కిరీటం



కిరీటాన్ని అందజేస్తున్న జీవన్‌రెడ్డి

గంభీరావుపేట, జనవరి 7: గంభీరావుపేట మండల కేంద్రంలోని సీతారామచంద్ర మూర్తికి ఏసీపీ జీవన్‌రెడ్డి 510 గ్రాముల వెండి కిరీటాన్ని ఆదివారం అందజేశారు. గంభీరావుపేటకు చెందిన జీవన్ రెడ్డి ప్రస్తుతం హుజూరాబాద్ ఏసీపీగా పనిచేస్తున్నారు. జీవన్‌రెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి గంభీరావుపేట వచ్చి సీతారామాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రామచంద్రమూర్తికి వెండి కిరీటాన్ని అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు జీవన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ఫింగర్ ప్రింట్ స్కానర్ బుక్ చేస్తే పార్సిల్‌లో రాళ్లు



రాళ్లను చూపిస్తున్న యువకుడు

కోనరావుపేట, జనవరి 7 : ఫింగర్ ప్రింట్ స్కానర్ బుక్ చేస్తే అతను చేసిన పార్సిల్‌లో రాళ్లు రావడంతో ఆ యువకుడు అవాక్కయ్యాడు. కోనరావుపేట మండలం కనగర్తి గ్రామానికి చెందిన కొల్లూరి వికాస్ అని యువకుడు ఫింగర్ ప్రింట్ స్కానర్‌ను ఆన్‌లైన్‌లో బుక్ చేశాడు. జనవరి 1న బుక్ చేయగా ఏడో తేదీన పార్సల్ ఇంటికి వచ్చింది. పార్సిల్ బాయ్‌కి రూ.2718 చెల్లించాడు. అతడు వెళ్లిన తర్వాత పార్సిల్ విప్పి చూడగా తెల్లటి రాళ్లు కనిపించాయి. వెంటనే పార్సిల్ బాయ్‌కి ఫోన్ చేయగా తిరిగి దానిని రిటర్న్ పెట్టుకోవాలని చెప్పి వెళ్లిపోయాడు.

వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షుడిగా లక్ష్మణ్

వేములవాడ టౌన్, జనవరి 7 : రాజన్న సిరిసిల్ల జిల్లా వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షుడుగా పల్లెపు లక్ష్మణ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శివరాత్రి అయిలమల్లు తెలిపారు. వేములవాడ మండలం అగ్రహారంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి సమావేశంలో జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నాంపల్లి గ్రామానికి చెందిన పల్లెపు లక్ష్మణ్‌తోపాటు 18 మందితో కూడిన జిల్లా కార్యవర్గాన్ని 13 మండలాల అధ్యక్షుల సమక్షంలో ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు.

మంత్రి పొన్నం ప్రభాకర్‌కు సన్మానం

తంగళ్లపల్లి, జనవరి 7: బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను యూత్ కాంగ్రెస్ నాయకులు ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా స్థానిక సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. సిరిసిల్ల నియోజకవర్గ యూత్‌కాంగ్రెస్ ప్రెసిండెట్ చుక్క రాజశేఖర్, సోషల్ మీడియా కోఆర్డినేటర్ గడ్డం మధుకర్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎగుర్ల ప్రశాంత్, గంగ రమణారెడ్డి ఉన్నారు.

పోతుగల్‌లో జిల్లా స్థాయి క్రికెట్ టోర్నీ

ముస్తాబాద్, జనవరి 7: మండలంలోని పోతుగల్ గ్రామంలో గాలిగాని దినేశ్ అండ్ జంగ శ్రీనివాస్ స్మారక క్రికెట్ టోర్నమెంట్‌ను ఈ నెల 11 నుంచి నిర్వహించనున్నట్లు ఈవెంట్ ఆర్గనైజర్ ఆది శేఖర్, కిట్టు, నవీన్, నాని, నరేశ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వివరాలకు 9100729106, 9963865280, 99633250318 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

యాదవ యువజన సంఘం కార్యవర్గం

ముస్తాబాద్, జనవరి 7:ముస్తాబాద్ పట్టణ యాదవ యుజవన సంఘంను ఆదివారం ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా గడ్డి కుమార్, ఉపాధ్యక్షుడిగా శ్యాగ దేవయ్య, రైటర్‌గా శ్యాగ మహేశ్, క్యాషియర్‌గా దారవేని నరేశ్, సంయుక్త కార్యదర్శిగా ఆవునూరి పర్శరాములు, ప్రధాన కార్యదర్శిగా దొరగొల్ల రమేశ్ ఎన్నికయ్యారు.

ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా శ్రీనివాస్

ముస్తాబాద్, జనవరి 7: ముస్తాబాద్ మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా పడమటింటి శ్రీనివాస్‌ను ఆదివారం ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా గందె చంద్రం, కోటగిరి దేవేందర్, ప్రధాన కార్యదర్శిగా పప్పుల శ్రీకాంత్, సలహాదారులుగా మాచెట్టి లక్ష్మణ్, బండారి సత్తయ్య, కోశాధికారిగా పప్పుల శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులుగా బొందుగుల శ్రీనివాస్, ఉప్పల చంద్రం, కూర నగేశ్, గందె శ్రీనివాస్, నార్ల శ్రీనివాస్, మురికి భాస్కర్, పప్పుల భద్రయ్య, గరిపెల్లి రమేశ్ ఎన్నికయ్యారు.

యువత క్రీడల్లో రాణించాలి

వీర్నపల్లి, జనవరి 7 : మారుమూల ప్రాంత యువత క్రీడల్లో రాణించాలని ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు మల్లారపు అరుణ్ కుమార్ అన్నారు. వీర్నపల్లి మండల కేంద్రంలో క్రీడాకారులకు ఆదివారం వాలీబాల్ కిట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతోపాటు క్రీడల్లో ప్రతిభ కనబరచాలన్నారు. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు సహాయ సహకారాలు అందిస్తామన్నారు.

భూ వివాదంలో అన్నపై తమ్ముడి దాడి

చందుర్తి, జనవరి 7 : చందుర్తి మండలం కట్టలింగంపేట గ్రామంలో ఆదివారం భూ వివాదంలో అన్నపై తమ్ముడు దాడి చేశాడు. గ్రామస్థులు, పోలీసుల కథనం ప్రకారం కట్టలింగంపేటకు చెందిన కోరుట్ల నారాయణ, కోరుట్ల చంద్రయ్య అన్నదమ్ములు. వీరి మధ్య కొంతకాలంగా భూ వివాదం కొనసాగుతోంది. ఆదివారం అన్నదమ్ముల మధ్య భూమి విషయమై గొడవ తలెత్తింది. తమ్ముడు దాడి చేయడంతో అన్న తలకు, చెయ్యికి తీవ్ర గాయమైంది. నారాయణ ఫిర్యాదుతో చంద్రయ్యపై కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ రంగస్వామి తెలిపారు.

'తెలంగాణను భ్రష్టు పట్టించిన గత ప్రభుత్వం'



సిరిసిల్లలో మాట్లాడుతున్న కేకే మహేందర్‌రెడ్డి

సిరిసిల్ల టౌన్, జనవరి 7: ప్రజా పాలనకు వస్తున్న స్పందనతో గత ప్రభుత్వం ఎంత గొప్పగా పాలించిందో అర్థం అవుతోందని, తెలంగాణను గత ప్రభుత్వం భ్రష్టు పట్టించిందని కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం సిరిసిల్ల పట్టణంలో ఆ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రజా పాలనలో భాగంగా జిల్లా వ్యాప్తంగా దాదాపు లక్షా 90 వేల మంది ప్రజలు దరఖాస్తులు ఇచ్చారన్నారు. ఇందులో ఎక్కువ శాతం ప్రజలు మహాలక్ష్మి పథకం, గృహ జ్యోతి పథకానికి దరఖాస్తు చేసుకున్నారన్నారు. రేషన్ కార్డులతోపాటు ఇతర సమస్యల పరిష్కారం కోసం కొందరు అర్జీలు సమర్పించారన్నారు. ప్రజల అభ్యర్థలను సావదానంగా పరిశీలించాక ప్రతీ సమస్యను పరిష్కరించే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయం తీసుకొంటుందన్నారు. వంద రోజులలో ఆరు గ్యారెంటీ పథకాలను అమలు చేసే దిశగా అడుగులు వేస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మూడు రోజులలో రెండు గ్యారెంటీలను అమలు చేసిందని, మరి కొద్ది రోజులలో మరో రెండు పథకాలను అమలు చేయబోతోందని అన్నారు. గత ప్రభుత్వ పాలనలో ప్రజల సమస్యలు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా ఉందన్నారు. బీఆర్ఎస్ తొమ్మిదిన్నర సంవత్సరాల కాలంలో కొత్త రేషన్ కార్డులు, పింఛన్లు ఇచ్చిన పాపాన పోలేదన్నారు. ఈ సమస్యలను కడతేర్చే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ప్రతిపక్ష పార్టీలోని కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు తమ ప్రభుత్వ పాలన చూసి మెచ్చుకోవాలన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే 72 గంటలలోనే రెండు పథకాలను అమలు చేసిందన్నారు. రెండోసారి అధికారంలోకి వచ్చిన నాలుగున్నర సంవత్సరాలలో బీఆర్ఎస్ ప్రభుత్వం రైతు రుణమాఫీ, ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతి, దళితులకు మూడు ఒకరాల భూమి, దళిత బంధు, గిరిజన బంధు ఇవ్వలేదన్నారు. స్థానిక ఎమ్మెల్యే కేటీఆర్ ఇక్కడ రైలు కూత పెట్టనిదే ఓట్లు అడగనన్నారని, వర్కర్‌ను ఓనర్ చేస్తానన్నారని చేయలేదని అన్నారు. బతుకమ్మ చీరల బిల్లులను ఇచ్చిన పాపాన పోలేదన్నారు. 22 లాండ్ క్రూజర్లతో ముఖ్యమంత్రిగా తన కాన్వాయి పోతుందని అనుకున్న కేటీఆర్ కల చెదిరి కథ మారి కలత చెందారని విమర్శించారు. కాంగ్రెస్‌వి 420 హామీలు అంటున్న కేటీఆర్‌కు ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పారన్నారు. ప్రజలు కర్రు కాల్చి వాత పెట్టారన్నారు. తొమ్మిదన్నర సంవత్సరాలలో బంగారు తెలంగాణ పేరుతో తెలంగాణ ప్రజల బతుకులు ఎలా నాశనం చేసారో వివ రించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం శ్వేత పత్రం విడదల చేసిందన్నారు. సమావేశంలో టీపీసీసీ సభ్యుడు నాగుల సత్యనారాయణ, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, ప్రధాన కార్యదర్శి మ్యాన ప్రసాద్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, నాయకులు గడ్డం నర్సయ్య, కామినేని రవీందర్, అన్నల్‌దాస్ బాను, వైద్య శివప్రసాద్, వెల్మల తిరుపతిరెడ్డి, కాముని నళినీకాంత్ పాల్గొన్నారు.

బాబోయ్.. కుక్కలు

- పాడిపశువులు, గ్రామస్థులపై దాడులు
- పట్టించుకోని పాలకవర్గం, అధికారులు



వీర్నపల్లి, జనవరి 7 : వీర్నపల్లి మండలం వన్‌పల్లి గ్రామం కేలోత్ తండాలో పిచ్చి కుక్కల స్వైర విహారం ఎక్కువైంది. గ్రామంలో గుంపులుగా తిరుగుతున్న కుక్కలను చూసి జనం భయపడుతున్నారు. ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే జంకుతున్నారు. పొలాల వద్ద కట్టేసిన పాడి పశువులు, గ్రామంలో తండావాసులపై కుక్కలు దాడి చేస్తున్నాయి. ఇప్పటి వరకు కేలోత్ తండా పూజారి గేదెతోపాటు నాలుగు ఆవులు మృతి చెందాయి. ముఖ్యంగా చిన్న పిల్లలను బయటకు పంపాలంటేనే గిరిజనులు, గ్రామస్థులు భయాందోళనకు గురవుతున్నారు. కుక్కల బెడద నివారించేందుకు అధికార యంత్రాంగం చర్యలు చేపట్టకపోవడంతో ప్రజలకు ప్రాణ సంకటంగా మారింది. ఇప్పటికైనా పాలకవర్గం, సంబంధిత అధికారులు స్పందించాలని, పిచ్చి కుక్కల బెడదను తొలగించాలని కోరుతున్నారు.

బెల్టుషాపులు మూసివేయాలి

గంభీరావుపేట, జనవరి 7 : జిల్లా వ్యాప్తంగా బెల్టుషాపులను తక్షణమే మూసి వేయాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు దోసల చంద్రం డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కొత్తగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వం బెల్టు షాపులను ఎత్తివేస్తామని ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. జిల్లా వ్యాప్తంగా బెల్టు షాపులు నడుస్తున్నాయన్నారు. గ్రామాల్లో బెల్టుషాపులతో యువత మద్యానికి బానిసలవుతున్నారని, తక్షణమే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. నాయకులు రఘు, ప్రేమ్‌కుమార్, బాబు, వంశీ తదితరులు ఉన్నారు.

నాణ్యమైన విద్యను అందించాలి

జగిత్యాల, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుకుంటున్న నిరుపేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని పట్టబద్రుల ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని ఇందిరా భవన్‌లో తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్- 475 ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులను ఉన్నత స్థానానికి చేర్చేలా లెక్చరర్లు దృష్టి సారించాలన్నారు. ప్రభుత్వ జూనియర్ లెక్చ రర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలి పారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా శాఖ అధ్య క్షుడు కె తిరుపతి రెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, కోశాధికారి జైపాల్ రెడ్డి పాల్గొన్నారు.

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జాన్‌వెస్లీ

సిరిసిల్ల టౌన్, జనవరి 7: ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జాన్‌వెస్లీ అన్నారు. ఆదివారం సిరిసిల్ల పట్టణంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మూషం రమేష్ అధ్యక్షతన పార్టీ జిల్లా స్థాయి ప్లీనరీ నిర్వహించారు. ముందుగా అమలవీరులకు నివాళులర్పించారు. అనంతరం జాన్‌వెస్లీ మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని రక్షించాలంటే మతోన్మాద బీజేపీని రానున్న సార్వత్రిక ఎన్నికల్లో గద్దెదించాలన్నారు. బీజేపీ పది సంవత్సరాల పాలనలో ప్రపంచ ఆకలి సూచిలో 111వ స్థానంలోకి వచ్చిందన్నారు. ప్రతీ సంవత్సరం 2కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన బీజేపీ ప్రభుత్వం హామీని అమలు చేయలేదన్నారు. 29 కార్మిక చట్టాలను రద్దు చేసి 4 లేబర్ కోడ్‌లు తెచ్చి పెట్టుబడిదారులకు ఊడిగం చేస్తుందన్నారు. అదాని, అంబాని అర్థికాభివృద్ధిని దేశ అభివృద్ధిగా చూపిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పది సంవత్సరాలలో బీజేపీ ప్రభుత్వంపై పెరుగుతున్న అసంతృప్తిని పక్కదోవ పట్టించే విధంగా మతవిద్వేషాలు రెచ్చగొడుతోందన్నారు. రాముడి పేరుతో రాజకీయం చేయడం దుర్మార్గం అన్నారు. ప్రజల విశ్వాసాలను సొమ్ము చేసుకోవడం సరికాదన్నారు. బీసీ కులగణన చేపట్టకుండా సుప్రీం కోర్టుకు వెళ్లిన చరిత్ర బీజేపీ ప్రభుత్వానిదేనని విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికలలో బీజేపీని ఓడించకపోతే ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని రక్షించుకోలేమన్నారు. సెక్యులర్ శక్తులు, దేశభక్తులు ఐక్యం కావాలని, బీజేపీ ఓటమి ద్వారా ప్రజల హక్కులు రక్షించుకోవాలన్నారు. తెలంగాణలో ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలను కాంగ్రెస్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు స్కైలాబ్ బాబు మాట్లాడుతూ ప్రజాపాలనలో కోటి 24లక్షల దరఖాస్తులు వచ్చాయని, ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన వాగ్ధానాలన్నింటిని చిత్తశుద్ధితో అమలు చేయాలన్నారు. గత ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇళ్ల హామీని అమలు చేయలేదన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం నిరపేదలకు ఇందిరమ్మ ఇవ్వాలని, పేదలు వేసుకున్న గుడిసెలకు పట్టాలు ఇచ్చి గృహ నిర్మాణం కోసం రూ. 5 లక్షలు ఇవ్వాలని అన్నారు. గత ప్రభుత్వం పేదలపై పెట్టిన అక్రమ కేసులను కాంగ్రెస్ ప్రభుత్వం ఎత్తివేయాలన్నారు. కమ్యూనిస్టులు బలహీనమ్దారని ప్రచారం జరుగుతోందని, కమ్యూనిస్టులను ఓట్లు, సీట్లతో చూడలేమని అన్నారు. పేదల హక్కుల కోసం నిర్వహిస్తున్న ప్రజా ఉద్యమాలను చూడాలన్నారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఎగమంటి ఎల్లారెడ్డి, జవ్వాజి విమల, మల్లారపు అరుణ్‌కుమార్, ఎరవెల్లి నాగరాజు, కోడం రమణ, ముక్తికాంత అశోక్, సూరం పద్మ, గురిజాల శ్రీధర్, మల్లారపు ప్రశాంత్, వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

బాలసాహితీవేత్త వాసరవేణి పర్శరాములుకు సన్మానం



జ్ఞాపికను అందుకుంటున్న పర్శరాములు

ఎల్లారెడ్డిపేట, జనవరి 7: ఆంధ్రప్రదేశ్‌లోని రాజమహేంద్రవరంలో ఆదివారం నిర్వహించిన ప్రపంచ తెలుగు మహాసభల్లో ఎల్లారెడ్డిపేట మండలం సింగారం గ్రామానికి చెందిన బాలసాహితీవేత్త వాసరవేణి పర్శరాములును ఘనంగా సన్మానించారు. పర్శరాములు సభల్లో 'మాతృ భాష ఉనికి కర్తవ్యాలు' అనే అంశంపై ప్రసంగించారు. బాల్యం నుంచే మాతృభాష మాధుర్యాన్ని బాలసాహిత్యం ద్వారా అందించేలా చూడాలని పేర్కొన్నారు. తెలుగు బాషా సాహిత్యాలు, ఇతర బాషల్లోకి అనువాదం చేయడంతోపాటు నిఘంటువులు రూపొందించాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి ఆకుల వెంకట శేషసాయి, సభాధ్యక్షుడు శేషారెడ్డి, తెలుగు మహాసభల ముఖ్య సంచాలకులు కే శిరాజు రాంప్రసాద్, రచయితలు, కవులు ప్రసాద్, పద్మాకమలాకర్, తీరుపట్ల సత్యనారాయణ, శ్రీరామచంద్రమూర్తి పాల్గొన్నారు.

పింఛన్ డబ్బులు ఇచ్చిన అవ్వకు పట్టుచీర



చీర అందజేస్తున్న ఆది శ్రీనివాస్

వేములవాడ టౌన్, జనవరి 7 : ఇటీవల శాసన సభ ఎన్నికల్లో భాగంగా వేములవాడ మండలం రుద్రవరం గ్రామానికి ప్రచారానికి వెళ్లిన ఆది శ్రీనివాస్‌కు గ్రామానికి చెందిన ముత్తవ్వ అనే వృద్ధురాలు ఎన్నికల ఖర్చుల నిమిత్తం తన పింఛన్ డబ్బులను అందించింది. పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాల్లో భాగంగా ఆదివారం గ్రామానికి వెళ్లిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ముత్తవ్వ ఇంటికి వెళ్లి పట్టు చీరను అందజేశారు. అనంతరం ఆమె ఆశీర్వదం తీసుకున్నారు.

అల్మాస్‌పూర్‌లో రామయ్య అక్షింతలతో శోభాయాత్ర



అల్మాస్‌పూర్‌లో అక్షింతల ఊరేగింపులో ఎంపీపీ

ఎల్లారెడ్డిపేట, జనవరి 7: ఎల్లారెడ్డిపేట మండలం అల్మాస్‌పూర్ గ్రామంలో అయోధ్య నుంచి వచ్చిన రాముడి అక్షింతల శోభాయాత్రను ఆదివారం ఘనంగా నిర్వహించారు. పురవీధుల గుండా ఊరేగించారు. కార్యక్రమంలో ఎంపీపీ రేణుక, ఉప సర్పంచ్ బాలయ్య, అర్చకుడు పురుషోత్తమచార్యులు, స్థానికులు శ్రీనివాస్‌గౌడ్, కమలాకర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విప్‌కు సన్మానం

ఇల్లందకుంట, జనవరి 7: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు ఇంజం వెంకటస్వామి, మారపల్లి శ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువా తో సన్మానించారు. విప్‌ను ధర్మపురి నియోజకవర్గంలోని ఆయన నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

కులం పేరుతో దూషించిన ఒకరిపై కేసు

వీణవంక జనవరి 7: మండలంలోని మామిడాలపల్లికి చెందిన కనకం వెంకటస్వామిని చల్లూరుకు చెందిన నల్లవెల్లి తిరుపతి కులం పేరుతో దూషించగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై వంశీకృష్ణ తెలిపారు. వెంకటస్వామి తన భూమిలో ఇంటి నిర్మాణం చేపడుతుండగా తిరుపతి పనులు నిలిపివేయాలని కులం పేరుతో దూషించాడని ఫిర్యాదు చేశాడని చెప్పారు.

సమాజంలో మార్పు కోసం న్యాయవాదులు కృషి చేయాలి



మాట్లాడుతున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వేణుగోపాల్

కరీంనగర్ అర్బన్, జనవరి 7: సమాజంలో అభివృద్ధి, మార్పు కోసం న్యాయవాదులు కృషి చేయాలని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఇవి వేణుగోపాల్ అన్నారు. ఆదివారం నగరంలోని ఓ విద్యాసంస్థలో జస్టిస్ కుమారయ్య లా కాలేజీలో చదివిన న్యాయవాదుల ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ న్యాయవాద వృత్తిని ఎంచుకొని స్థిరపడా లని అనుకునేవారు ప్రతిసవాళ్లు ఎదుర్కో వాలని అన్నారు. న్యాయవాద వృత్తిలోని అనుభ వాన్ని గడించుకుంటూ ముందుకు సాగాలని అన్నారు. న్యాయవాదులు అణ గారిన వర్గాల అభి వృద్ధికి, సమాజ చైతన్యానికి తమవంతుగా చేయూత నందించాలని కోరారు. అనంతరం న్యాయవాదులకు జ్ఞాపికలను బహూకరించారు. ఈ కార్యక్రమంలో జస్టిస్ కుమారయ్య లా కాలేజీ ప్రిన్సిపాల్, కరస్పాండెంట్ డాక్టర్ కె.జలజ, డైరెక్టర్ జి కృష్ణ ప్రసాద్, ఆత్మీయ సమ్మేళన కన్వీనర్ ఎ.కిరణ్ కుమార్, న్యాయమూర్తి కె.వెంకటేశ్, న్యాయవాదులు ఏవీ రమణ, గుండా భవాని, పొన్నం రజిత, మంతెన సురేష్ కుమార్, గాదం స్వామితేజ, బొంకూరి మోహన్, బండారు గాయత్రీ దేవి, ఎండీ నవాజ్, పత్తి శివప్రసాద్, వంకాయల రాజ్‌కుమార్, అట్ల ధీరజ్, సావుల రాజమౌళి, ఆడెపు దినేష్, అతికం రాజశేఖర్‌గౌడ్, ఎన్నం మమత, తాడూరి స్వాతి, బత్తిని స్వప్న, తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటర్ ఆపరేటర్ల సమస్యలను పరిష్కరించండి

ధర్మపురి, జనవరి 7: ఏళ్ల తరబడి నుంచి నెలకొన్న తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ వివిధ జిల్లాలకు చెందిన కంప్యూటర్ ఆపరేటర్లు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి వినతి పత్రాన్ని అందించారు. హైదరాబాద్‌లో ఉన్న ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మె ల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ వెంట రాగా కంప్యూటర్ ఆపరేటర్లు మంత్రి శ్రీనివాస్‌రెడ్డిని కలిసి తమ సమస్యలను వివరించి వినతి పత్రాన్ని అందిం చారు. ఈ మేరకు వినతి పత్రం జిరాక్స్ కాపీని ఆదివారం స్థానిక విలేకరు లకు పంపించారు. రెవెన్యూ శాఖలో దాదాపు 700 మంది కంప్యూటర్ ఆప రేటర్లు ఉన్నట్లు తెలిపారు. ఇందులో 302 మంది కంప్యూటర్ ఆపరేటర్లకు మాత్రమే బడ్జెట్, సాంక్షన్ ఆర్డర్ ఉన్నాయని పేర్కొన్నారు. గత ఐదు 5 నుండి 15 ఏళ్లుగా పని చేస్తున్న ఆపరేటర్లకు 31 నెలలుగా వేతనాలు లేవని అన్నారు. ఉద్యోగ భద్రత లేదని, పెండింగ్‌లో ఉన్న వేతనాలు వారికి వెంటనే విడుదల చేయాలని కోరారు. ఉద్యోగ భద్రత, టైపిస్ట్ కంప్యూటర్ ఆపరేటర్ సాంక్షన్ ఆర్డర్ ఇప్పించాలని కోరారు. దీంతో మంత్రి సానుకూలంగా స్పందిం చి వెంటనే ప్రిన్సిపల్ సెక్రటరితో మాట్లాడి ఫైల్ గురించి తెలుసుకుని సమ స్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

రాములోరి అక్షింతలు అందలేదని రాస్తారోకో



కొనాయపల్లిలో రోడ్డుపై బైఠాయించిన గ్రామస్థులు

వేములవాడ టౌన్, జనవరి 7 : అయోధ్యలోని రాంమందిర్ నుంచి వచ్చిన అక్షింతలు తమకు అందలేదని వేములవాడ మున్సిపల్ పరిధిలోని కొనాయపల్లి గ్రామంలో పలువురు ఆదివారం రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలు గ్రామంలో ఇంటింటికీ పంపిణీ చేయకుండా కొంత మంది మాత్రమే తీసుకున్నారని ఆరోపించారు. దీంతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు రాస్తారోకో విరమించాలని సర్ది చెప్పారు. వినకపోవడంలో అక్కడికి చేరకున్న మరికొంత మంది గ్రామస్థులు అక్షింతలు వచ్చిన సమయంలో గ్రామంలో ర్యాలీ నిర్వహించామని, ర్యాలీ వద్దకు వచ్చిన వారికి అందించామని అందరికీ అందించకపోవడం పొరపాటేనని పేర్కొనడంతో రాస్తారోకో విరమించారు.

మల్లికార్జునస్వామి ఆలయ పూజారుల నిరసన

- ఆలయ కమిటీపై ఆగ్రహం - అరగంటపాటు నిలిచిన పూజలు



గ్రామస్థులు, పూజారుల మధ్య వాగ్వాదం

చందుర్తి, జనవరి 7 : చందుర్తి మండలం నర్సింగాపూర్ గ్రామంలోని మోహినికుంట మల్లికార్జునస్వామి ఆలయంలో గ్రామస్థుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆలయ కమిటీ, పూజారుల మధ్య వివాదం ముదురుతోంది. ఆలయ వంశపారంపర్య అర్చకుడితో పాటు ఒగ్గు పూజారులు ఆదివారం అరగంట పాటు నిరసన వ్యక్తం చేశారు. పూజల టికెట్లు, దుకాణం వేలం పాటల ద్వారా వచ్చే ఆదాయంతోపాటు ఆలయంలో జరిగే స్వామివారి కల్యాణోత్సవానికి వచ్చే కట్నాలు, విరాళాల రూపంలో వచ్చే ఆదాయాన్ని మల్లికార్జున స్వామి ఆలయం పేరిట ఉన్న బ్యాంకు ఖాతాలో జమ చేయకుండా జాప్యం చేస్తున్నారని మండిపడ్డారు. గత నెల 24న ఆలయ కమిటీ చెందిన ఓ నాయకుడు తమపై అకారణంగా చేయి చేసుకున్నాడని ఒగ్గు పూజారులు వాపోయారు. తమపై దాడి చేసినా పట్టించుకునే వారే లేరన్నారు. ఇప్పటికైనా దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు మల్లికార్జునస్వామి ఆలయంపై దృష్టి సారించాలని, ఆలయ ఆదాయం పక్కదారి పట్టకుండా చర్యలు చేపట్టాలని కోరారు.